## ఫార్మర్ అగ్రిమార్టు సందర్శన



మాట్లాడుతున్న నాబార్డ్ డీజీఎం స్వాతి

తలమడుగు, అక్టోబర్ 8 : సుంకిడి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మర్ అగ్రిమార్టును నాబార్డ్ డీజీఎం స్వాతి తనిఖీ చేశారు. వస్తువుల నాణ్యత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే నాబార్డు డీడీఎం రాహుఫ్ సందర్శించారు. అగ్రిమార్ట్ లావాదేవీల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంచాలన్నారు. వారి వెంట సంఘం అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, సీవో మోతి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

## తులసీ మొక్కలు పంపిణీ

ఉట్నూర్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో రాంజీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ప్రవీణ్ తులసీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది రంగ గంగాధర్, హిందూ సంఘాల నాయకులు రాజగోపాల్, భక్తులు, సభ్యులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ని కలిసిన మున్నూరు కాపులు

ఉట్నూర్, అక్టోబర్ 8 : ఉట్నూర్ డివిజన్ మున్నూరు కాపులు మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బొడ్డు కిరణ్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా ఉట్నూర్ ప్రాంతంలో తమ కులస్తులు జీవిస్తున్నారని కనీసం కుల సంఘం భవనం లేదని కావున సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కులస్తులు జీవన్, దేవీదాస్, రాజేశ్, సత్యం, నాసాని శ్రీధర్, జగన్, సురేశ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎదులాపురం, అక్టోబర్ 8 : దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎన్పీఆర్డీ సంఘం అధ్యక్షుడు నగేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో సంఘం జిల్లా బాడీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే దివ్యాంగుల సభ కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఉద్యమ కార్యాచరణతో పాటు భవిష్యత్ పోరాటలపై చర్చించేందుకు హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24న సుందరయ్య భవనం వద్ద జెండా ఆవిష్కరించి హైదరాబాద్ బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఎన్పీఆర్డీ జిల్లా కార్యదర్శి ఆరీఫా బేగం, శత్రుఘున్, అనసూయ, పోచ్చన్న పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలి

భైంసా, అక్టోబర్ 8 : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని బీజేపీ ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. మంగళవారం భైంసాలోని న్యాయవాదులు, డాక్టర్లకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎన్నికల పట్టణ ఇన్‌చార్జి కపిల్, సహ ఇన్‌చార్జి దిలీప్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



నిర్మల్‌అర్బన్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



నేరడిగొండ: దుర్గామాత పల్లకి మోస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



ఖానాపూర్‌రూరల్: తర్లపాడు గ్రామంలో కరెన్సీ నోట్లతో అలంకరణ

# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 8: ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గమాతను మంగళవారం గ్రామస్తులు రూ.6,10,000 విలువైన నగదుతో అలంకరించారు. మార్కెట్‌లో చలామణిలో ఉన్న 100, 200, 500 రూపాయల నోట్లతో అమ్మవారిని, మండపాన్ని తీర్చిదిద్దారు.


నిర్మల్ అర్బన్/లక్ష్మణచాంద/ఎదులాపురం/నేరడిగొండ, అక్టోబర్ 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం, లక్ష్మణచాంద మండలం మునిపెల్లిలో, ఆదిలాబాద్‌లోని ఇందిరమ్మ కాలనీలో విజయ దుర్గా మండలి ఆధ్వర్యంలో, నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామంలో దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుంచి మంగళహారతులతో మండపాలకు చేరుకొని కుంకుమ పూజలు చేశారు.

బోథ్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను మండప నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్ యాదవ్, రుక్మాణ్ సింగ్, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

### కనుల పండువగా పల్లకీ శోభయాత్ర

నేరడిగొండ, అక్టోబర్ 8 : మండల కేంద్రంలో దుర్గామాత శోభాయాత్ర మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ శోభాయాత్రలో పాల్గొని స్వయంగా పల్లకీ మోశారు. దీక్షాపరులు అమ్మవారి పల్లకీ ఊరేగింపును ప్రధాన వీధుల గుండా కొనసాగించారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండపం వద్దకు చేరుకోగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, నాయకులు గులాబ్‌సింగ్, భక్తులు పాల్గొన్నారు.

### దుర్గాదేవికి మాజీ జడ్పీటీసీ పూజలు



తలమడుగు: పూజలు చేస్తున్న మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడి

తలమడుగు, అక్టోబర్ 8: మండల కేంద్రంతో పాటు సాయిలింగి, బీసీ కాలనీలోని దుర్గాదేవి మండపాల్లో మంగళవారం మాజీ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మిరాజేశ్వర్‌ను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ ప్రకాశ్‌రావ్, మాజీ సర్పంచ్ పొచ్చన్న, హిందూరెడ్డి, మోహన్, నారాయణ, వెంకట్, రావుల నారాయణ, విలాస్ యాదవ్, పొచ్చన్న యాదవ్ పాల్గొన్నారు.

## ఆర్ఐ కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 8 : ఆదిలాబాద్ మున్సిపల్ ఆర్ఐ వెంకటేశ్ సోదరుడు నగేశ్ భార్య ఇటీవల మృతి చెందింది. మంగళవారం స్వీపర్ కాలనీలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. అలాగే తిలక్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ కార్యకర్త మాదస్తు శ్రీనివాస్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట రోకండ్ల రమేశ్, ఇజ్జగిరి నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగరావ్, కొండా గణేశ్, అశోక్ స్వామి, సోదం కేశవ్, ప్రశాంత్ ఉన్నారు.

## పీవోను కలిసిన ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి

ఉట్నూర్, అక్టోబర్ 8: నార్నూర్ మండలం మరపగూడ గ్రామానికి చెందిన పూసం అశోక్ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మంగళవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ప్రశంసించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యతోనే ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. మారుమూల ప్రాంతం వ్యవసాయ కుంటుంబం నుంచి ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణం అన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందించాలని వినతిపత్రం పీవోకు సమర్పించారు. కార్యక్రమంలో ఏటీఏ నాయకులు మెస్రం గంగారాం, మండాడి చంద్రభాను, జగన్, ప్రభాకర్, ఇస్రు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 8 : నిర్మల్ జిల్లా రా రైస్ మిల్లర్స్ అండ్ బాయిల్డ్ మిల్లర్లు రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అధ్యక్షుడు వెంకట్ రావు మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్షుడు వెంకట్ రావు మాట్లాడుతూ సన్న ధాన్యానికి 67 శాతం బియ్యం రావని మిల్లర్లు ధాన్యం దిగుమతికి సుముఖంగా లేరని దొడ్డు ధాన్యం కూడా మిగతా జిల్లాల కంటే నిర్మల్ జిల్లాలో 7 నుంచి 8 కేజీలు ఔటర్న్ తక్కువగా రావడం జరుగుతుందన్నారు. ఔటర్న్ తగ్గించని ఎడల క్వింటాల్‌కు నష్ట పరిహారం కింద రూ.500 కేటాయించాలని మిల్లింగ్ చార్జీల కింద క్వింటాల్‌కు రూ.150 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికులకు జీతాలు అందించడంలో ప్రభుత్వం విఫలం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 8 : నిర్మల్ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు ఇవ్వడంలో విఫలమైందని బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నజీరుద్దీన్ అన్నారు. కార్మికులకు మూడు నెలల జీతాలు చెల్లించకపోవడంతో విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష మంగళవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులకు తన వంతు మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు కార్మికులకు సకాలంలో వేతనాలు అందిచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిత్యం పట్టణాన్ని పరిశుభ్రం చేసే కార్మికులు ఏడు రోజులుగా సమ్మె చేయడంతో రోడ్లపై ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయిందని, ప్రధాన వీదులు, కాలనీలు కంపు కొడుతున్నాయన్నారు. పండుగపూట కార్మికులను పస్తులు ఉంచకుండా వారికి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా. కిరణ్ కొమ్రేవార్

భైంసా, అక్టోబర్ 8 : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా. కిరణ్ కొమ్రేవార్ డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. సన్న వడ్లకే కాకుండా దొడ్డు రకం వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ముథోల్ నియోజకవర్గంలో రైతులకు సరిపడా సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. భైంసా, కుభీర్‌లో సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదన్నారు. రైతులు పండించిన సోయాను కొనుగోలు చేయాలని, లేనిచో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మహేశ్, రాజు, గౌతమ్ పాల్గొన్నారు.

### బాసర అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

బాసర, అక్టోబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం బాసర అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా. కిరణ్‌కొమ్రేవార్ అన్నారు. మంగళవారం బాసరలో సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం మూల నక్షత్ర పూజలకు తరలివచ్చే భక్తుల కోసం ప్రభుత్వం కనీస అవసరాలను ఏర్పాటు చేయలేదన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శ్యామ్, మహేశ్, గౌతమ్ ఉన్నారు.

## రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు బయలుదేరిన పీఆర్టీయూ నాయకులు

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 8 : హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన 35వ పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు నర్సాపూర్(జీ) మండల పీఆర్టీయూ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మండలాధ్యక్షుడు గంగాచరణ్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా అసోసియేట్ నాయకులు చంద్రశేఖర్, భూమన్న, లక్ష్మణ్ ఉన్నారు.

## ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని అమలు చేయాలి

జైనథ్, అక్టోబర్ 8: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐకేపీ ఏపీఎం భగవాండ్లు సూచించారు. మంగళవారం ఆకోలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ రిజిస్టర్, పిల్లల ఎదుగుదల రిజిస్టర్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, బాలింతలకు, గర్భిణులకు బాలామృతాన్ని అందించాలన్నారు. కేంద్రంలో బరువులు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవ్, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

జైనథ్, అక్టోబర్ 8 : మండలంలోని బీఆర్ఎస్ క్రియశీల కార్యకర్త అయిన మంద సంటెన్న పిడుగు పాటుకు గురై మృతి చెందాడు. మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్న జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షల నగదును అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ నగదును సంటెన్న కొడుకు కూతురు పేరుతో నగదు బ్యాంకులో వేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు కోల సుమ పరమేశ్వర్, అయిండ్ల భగవాన్‌దాస్, మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు కూరెల్లి, బీ రాజీవ్, చిట్యాల సంజీవ్, పెల్లి రామయ్య, రమేశ్, మంద రాము, గ్రామస్తులు ఉన్నారు.

## దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 8 : నిర్మల్ జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కరించాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ అన్నారు. మంగళవారం టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ 35 కిలోల బియ్యం వచ్చే అంత్యోదయ కార్డులు, స్వయం ఉపాధి రుణాలు, ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రతినెల దివ్యాంగులకు ప్రత్యేక ఫిర్యాదు కార్యక్రమం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో శివకుమార్, లింగన్న, రాజేశ్, భీమన్న, జ్యోతి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## అన్ని రకాల కూరగాయలు సేకరించాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 8: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు అన్ని రకాల కూరగాయలతో పాటు పండ్లను సేకరించాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హర్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేతలు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సురేశ్ అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రాజేంద్రనగర్‌కు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హర్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేతలు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సురేశ్‌లు ఈవో సంజీవరావ్‌తో కలిసి వివిధ రకాల కూరగాయలతో పాటు గుమ్మడి, పండ్లకు చెందిన విత్తనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి రైతులతో పాటు ప్రజలు పండించే వివిధ రకాల పండ్లతో పాటు గుమ్మడి, దోసకాయలు, సోరకాయలు, అన్ని రకాల కూరగాయలు సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య మండలి జిల్లా కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే, గోపీనాథ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్నూర్‌కు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 8 : నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధనోరా(బీ)గ్రామంలోని విఠల్ రుక్మాయి ఆలయంలో మంగళవారం గ్రామస్తులు, మహిళా భవాని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ముత్నూర్ గ్రామంలోని గుట్టపై కొలువుదీరిన దుర్గాదేవి ఆలయం వరకు మహిళా భక్తులు పాదయాత్ర చేపట్టారు. దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా తోట వేణు



తోట వేణు

దస్తురాబాద్, అక్టోబర్ 8 : పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా దస్తురాబాద్‌కు చెందిన తోట వేణు మంగళవారం ఎన్నికయ్యారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆయుధ పూజ

భైంసా, అక్టోబర్ 8 : భైంసాలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు వెంకటేశ్, నవీన్, రాజేందర్, దత్తాత్రి, శ్రీను, నరేశ్ పాల్గొన్నారు.

## డీఎస్సీ 2024 ఎంపిక జాబితా విడుదల

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 8 : డీఎస్సీ 2024 ఎంపిక జాబితా మంగళవారం విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి డా. రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టు ఖాళీలకు గాను డీఎస్సీ ప్రక్రియ జరగగా ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ అనుమతితో అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందన్నారు. వాటిని బుధవారం లాల్‌బాగ్ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మకు పూజలు చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 8: ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, రెండో బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి హాజరయ్యారు. బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ దపంతులు, అదనపు కలెక్టర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

## పత్తి పంటపై క్షేత్ర ప్రదర్శన

బోథ్, అక్టోబర్ 8: కౌఠ(బీ) గ్రామానికి చెందిన యల్ల మహిపాల్ రెడ్డి అనే రైతు సాగు చేసిన నూజివీడ్ సీడ్స్ వారి ఆశ ఎన్‌సీఎస్-911 అనే పత్తి రకంపై మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆశ అనే పత్తి వంగడం అన్ని రకాల చీడపీడలను తట్టుకొనే శక్తి కలిగి ఉంటుందన్నారు. రెండో పంట వేసుకునే వారు విన్నర్ ఎన్ఎంహెచ్-8352 వేసుకోవచ్చని, ఈ రకమైన మొక్కజొన్న వేరే ఏ ఇతర రకాల కన్న అధిక దిగుబడి అందిస్తుందన్నారు. అనంతరం రైతు మహిపాల్ రెడ్డిని కంపెనీ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నూజివీడ్ సీడ్స్ యాజమాన్యం డీఆర్ఎం రాంమోహన్, ఎస్‌వోలు మహేందర్, సాయినాథ్, ఎండీవో ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## మహాత్ముని ముత్యాల హారాలు పుస్తకావిష్కరణ

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 8 : రాంజీగోండ్ భవన్‌లో ఉట్నూర్ సాహితీ వేదిక అధ్వర్యంలో మంగళవారం దామెర్ల నాగేశ్వరరావు రచించిన మహాత్ముని ముత్యాల హారాలు పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, సాహితీ వేదిక అధ్యక్షుడు జాదవ్ బంకట్‌లాల్, ఐటీడీఏ ఈఈ భీంరావ్, వ్యవస్థాపకుడు మర్సుకోల తిరుపతి, పూర్వ అధ్యక్షుడు ప్రక్రియ రూపకర్త రాథోడ్ శ్రావణ్, ప్రచార కార్యదర్శి ఆత్రం మోతీరాం, కవులు ఇందల్ సింగ్, పెందూర్ మాధవ్ రావ్, జాదవ్ మురళి, పరమేశ్వర్, ప్రశాంత్ కుమార్, వినోద్, ప్రభు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 8 : ఇంటి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నర్సాపూర్(జీ), అంజనితండా, గొల్లమాడ గ్రామాల్లో నిర్వహించిన డ్రైడేలో పాల్గొని పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఇళ్లు, వార్డులు, కాలనీలు, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ కైలాస్, సంస్కృతి, ఆపరేటర్ చందు పాల్గొన్నారు.

## బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

బాసర, అక్టోబరు 8 : బాసర సరస్వతీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తును మంగళవారం నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. క్యూలైన్ల ఏర్పాట్లు, పార్కింగ్, గోదావరి వద్ద స్నానాలు ఆమె పరిశీలించారు. అనంతరం పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, మూలనక్షత్ర పూజల్లో భాగంగా భక్తులకు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి దొంగతనాలు జరుగకుండా నిరంతరంగా సీసీటీవీ కంట్రోల్ రూంలో సిబ్బంది అనుక్షణం గమనిస్తుండాలని సూచించారు. బందోబస్తులో 200 మంది పోలీసుల పాల్గొంటున్నారని తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అవినాశ్‌కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అడవులను కాపాడుకుందాం

నర్సాపూర్(జీ), అక్టోబర్, 8: భవిష్యత్ తరాల కోసం అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాలని ఎఫ్ఎస్‌వో అలేఖ్య అన్నారు. మంగళవారం నర్సాపూర్(జీ) పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అటవీ శాఖలకు సంబంధించిన చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సాయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## జైనథ్‌కు చేరకున్న బతుకమ్మ చీరలు

జైనథ్, అక్టోబర్ 8: జైనథ్ మండలానికి 12,240 బతుకమ్మ చీరలు వచ్చినట్లు ఇందిరమ్మ మండల సమాఖ్య ఏపీఎం భగవాండ్లు తెలిపారు.వచ్చిన చీరలను మండల సమాఖ్య కార్యాలయంలో భద్రపర్చినట్లు తెలిపారు.

## ఆలయంలో చోరీకి యత్నం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

కుంటాల, అక్టోబర్ 8: ఓలా గ్రామ శివారులోని శివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి హుండీ తాళం పగలగొట్టి డబ్బులను తీయడానికి విఫల యత్నం చేశారు. తాళం తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ దేవ్‌రావ్ పరిశీలించారు. సీసీటీవీ పుటేజీలో ఒకరు కనిపించగా, చోరీ సమయంలో లోపలికి వెళ్లిన తర్వాత దొంగలు సీసీటీవీ కనెక్షన్ తొలగించినట్టు తెలుస్తోంది. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## నాటుసారా తయారు చేసి విక్రయిస్తే చర్యలు



పటిక బెల్లం, నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్న ఆబ్కారీ శాఖ అధికారులు

పెంబి, అక్టోబర్ 8 : నాటుసారా తయారు చేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి అబ్దుల్ రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. జీ రాజేంద్రప్రసాద్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 8 టన్నుల నల్ల బెల్లం, 8.7 క్వింటాళ్ల పటిక బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆబ్కారీ సీఐలు లక్ష్మణ్ రావు, గంగారెడ్డి, ఎస్ఐలు వసంత్‌రావ్, గజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి మృతి

సోన్, అక్టోబర్ 8: గంజాల్ గ్రామ సమీపంలోని కారు ఢీ కొన్న ప్రమాదంలో మంగళవారం పశువుల కాపరి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలకు వెళ్లితే.. కొద్ది రోజుల క్రితం పుట్టి హనుమవ్వ(48) బతుకుదెరువు కోసం వెల్గటూర్ నుంచి వలస వచ్చి గంజాల్ గ్రామంలో తన చెల్లి వద్ద ఉంటుంది. ప్రతి రోజూలాగే ఉదయం గంజాల్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గేదెలను మేపుతుండగా ఆర్మూర్ వైపు నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కూతురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సోన్ ఏఎస్సై భూమేశ్వర్ తెలిపారు.

## పరామర్శ

బజార్‌హత్నూర్. అక్టోబర్ 8: బజార్‌హత్నూర్‌కు చెందిన శ్రీహరి, భగత్ వినోద్, పడిపెల్లి పోతన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఆయన వెంట పాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, బీజేపీ మండల కన్వీనర్ పోరెడ్డి శ్రీనివాస్, కొత్త శంకర్, గణేశ్, నందు, సుకుదేవ్, రాజేశ్వర్ ఉన్నారు.

## ఎస్ఐకి సన్మానం

ఇచ్చోడ, అక్టోబర్ 8 : ఇచ్చోడ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిని మంగళవారం ఎస్సీ యువకులు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో బాబు జగజీవన్ రావ్, అధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణ్, అశోక్, లక్ష్మణ్, మాజీ చైర్మన్ లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎదులాపురం, అక్టోబర్ 8: జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం కోసాయి గ్రామానికి టికెట్ తీసుకొని రైలు ఎక్కాడు. కొద్ది సేపటికే ఆదిలాబాద్ పట్టణ శివారులో రైలు కింద పడడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారు రిమ్స్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉంది. కాగా రైలు నుంచి ప్రమాదశాత్తు కిందపడ్డాడా.. లేదా ఎవరైనా కావాలనే తోసేశారా అనేది తెలియాల్సి ఉంది.

## భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దని వినతి

ఎదులాపురం, అక్టోబర్ 8: తాలూకా మున్నూరు కాపు సంఘానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నారని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించి అనుమతి ఇవ్వద్దని సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్ స్పష్టం చేశారు. మంగళవారం సంఘం ప్రతినిధులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, సంద నర్సింగ్, ప్రవీణ్‌కుమార్, జోగు రవి, పందిరి భూమన్న, సంతోష్, మహేందర్, మీనా, శివకుమార్, రఘుపతి, పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి..

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 8 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీగా ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకుని ఓటు వేసిన వారు కూడా తమ ఓటు హక్కును మరలా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మెమోల జిరాక్సులు కావాలన్నారు. ఫామ్ 19 నింపడం ద్వారా ఆన్‌లైన్‌లో ఇదే ఫోర్టల్‌లో స్కాన్ కాఫీలు జతచేసి ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్డీవో రత్న కళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ ఉన్నారు.

### పుస్తకావిష్కరణ

నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆర్థిక సామాజిక ముఖచిత్రం 2024 పుస్తకాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, ఇతర అధికారులు ఉన్నారు.